(గత వారం తరువాయి)

వుంటున్నారు?" అని ప్రశ్నించాను.

"పద్నాలుగు వందల ఏళ్ళ నుంచి" శకీమని సమాధానం వచ్చింది.

ఉలిక్కిపడ్డాను. ఆయన కూడా నాలాగే ఒక ఆత్మ!

"తమరి పేరు?"

"విజయసింహుడు"

పిడుగు పడ్డట్టయ్యింది. ఎప్పుడో చదివిన చరిత్ర పుస్తకాలు జ్ఞాపక మొచ్చాయి.

"అంటే, స్వర్ణయుగం కాలం నాటి భయంకర దోపిడీ దొంగ విజయసింహుడు తమరేనా" అను మానంగా ప్రశ్నించాను.

"దోపిడి దొంగనా? హహ్హహ్హా" అంటూ బిగ్గరగా నవ్వాడు.

"ఒకటి గుర్తుంచుకో, అన్ని కాలాల్లోనూ పాలకులే అసలు సిసలైన దోపిడీ దొంగలు. ఇక స్వర్ణయుగం మాటంటావా! రాజులు విసిరిన ఎంగిలి మెతుకులు తిని బలిసిన వూరకుక్కలు అల్లిన కట్టు కథ అది"

"అయితే మీరు ఏ నేరమూ చేయలేదా?"

"చేశాను, ప్రజల కన్నీళ్ళను కొనగోటితో తుడిచాను"

తన ముందు ఏవేవో దృశ్యాలు కదులుతున్నట్టుగా విజయసింహుడు కళ్ళను విప్పార్చాడు.

* * *

"విజయసింహుడు పట్టుబడ్డాడట!"

"విజయసింహుడు అనొద్దు. దేవుడు అను. మన దేవుడు అను"

"ఈ రోజు ప్రజల సమక్షంలో ఉరి"

"దేవుడు కూడా చచ్చిపోతాడా?"

రాజధాని ప్రధాన వీధి ప్రజలతో నిండిపోయింది. ప్రజలు తమ కన్నీళ్ళలో తామే తడిసిపోతున్నారు. ఏడుస్తున్న శబ్దం బయటికి వినిపిస్తే చాలు, సైనికుల కొరడాలు గాల్లోకి సర్రున లేస్తున్నాయి.

విజయసింహుడు ఠీవిగా నిలబడి వున్నాడు. ఇనుప గొలుసులతో బంధించి వుంచారు. చుట్టూ సైనికులు కత్తులను అరచేతిలో పెట్టుకుని నిలబడి వున్నారు. కొంచెం దూరంలో ఉరికొయ్య కఠిన హృదయంతో నిలబడి వుంది. ఉరితాడు గాలికి మెల్లిగా కదులుతూ వుంది. ఆ దేశపు పతాకమంత గర్వంగా వుందది.

తలారి నిర్లిప్తంగా నిలబడి వున్నాడు. ఒంట్లో రక్తమే లేనట్టుగా పాలిపోయి వున్నాడతను. ఎందరి మరణాలనో అతి సమీపం నుంచి చూసిన అతను ఈ రోజు గజగజ వణికిపోతున్నాడు. రెండు రోజులుగా అతనికి నిద్రాహారాలు లేవు. పాపభారంతో అతని హృదయం క్రుంగిపోతూ వుంది.

మనసులోనే అతను భగవంతుడిని ప్రార్థిస్తున్నాడు.

"దేవుడా! నేను నిమిత్తమాత్రుడిని. నన్ను క్షమించు. ఒక మహావీరుణ్ణి ఇముడ్చుకునే శక్తి ఈ దేశానికి లేదు. అందుకే అతన్ని నీ రాజ్యానికి కానుకగా పంపుతున్నాను. భూలోకానికి, స్వర్గలోకానికి నేనొక వారధిని మాత్రమే. ప్రజల కన్నీటి వరదలో నేను కొట్టుకుపోయే రోజు వస్తే, దయతో నాకొక గడ్డి పోచను సాయంగా ప్రసాదించు తండ్రీ" అని అతను వేడుకున్నాడు.

"దేవుడుఎలా పట్టుబడ్డాడు"

"లోభం, ద్రోహం"

"మహారాజు వస్తున్నారు"

ప్రజలంతా శిరస్సును వంచారు. విజయసింహుడు తన తలను మరింత పైకి ఎత్తాడు. సూర్యుడినే తన చూపులతో ఢీ కొంటున్నాడు.

రాజు విజయగర్వంతో వచ్చాడు. విజయసింహుడి వైపు చూశాడు. రాజును విజయసింహుడు పట్టించుకోలేదు.

"విజయసింహా, రెండు రోజుల క్రితం నువ్వు పట్టుబడ్డావు. ఆ క్షణం నుంచి నేను రాత్రీపగలూ తేడా లేకుండా ఏకధాటిగా నిద్రపోయాను. ఎందుకో తెలుసా, ఇరవై ఏళ్ళు నా కంటి మీద కునుకే లేదు. దానికి కారణం నువ్వు" అన్నాడు మహారాజు.

విజయసింహుడు హేళనగా నవ్వాడు.

"ఇరవై ఏళ్ళుగా నేను కూడా నిద్రపోలేదు. నా నిద్రంతా నీలాంటి దుష్టుల గుండెల్లోనే అని నాకు తెలుసు" అన్నాడు.

రాజు కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి.

"మృత్యువు సమీపించినా, నీ పొగరు తగ్గలేదు" అన్నాడు.

"మృత్యువు సర్వదా నా దేహపు పొలిమేరల్లోనే తచ్చాడుతూ వుంటుందని నాకు తెలుసు" అన్నాడు విజయసింహుడు.

"నువు అరాజకవాదివి, న్యాయానికి శత్రువ్వి"

"మీరు కత్తిమొనతో రాసిన న్యాయశాస్త్రాలను నేను తిరగరాశాను. ఎందుకంటే మీ న్యాయశాస్త్రాలు నిరపరాధుల కన్నీళ్ళతో తడిసి చివికిపోయాయి.

"సుభిక్షమైన నా రాజ్యంలో అల్లకల్లోలం సృష్టించే హక్కు నీకెవరిచ్చారు?" కోపంగా ప్రశ్నించాడు రాజు.

"సుభిక్షం. రక్తపుటేరుల్లో కత్తులు స్నానమాడేచోట సుభిక్షం! నీ సుభిక్షం ఎక్కడుంది? రాచనగరులో వుంది. వినోదవిలాసాల్లో వుంది. మధుపాత్రలు మత్తెక్కితూలిన చోట వుంది. నేను మాట్లాడుతున్నది ప్రజల గురించి, నా ప్రజల గురించి. ఒక అన్నపు మెతుకు కోసం, కళ్ళలో ప్రాణాలు పెట్టుకుని బతికే వాళ్ల గురించి. నీ సైన్యం డెక్కల శబ్దానికి తమ పసికూనలను గుండెలకు హత్తుకుని భయంతో వణికిపోయే తల్లుల గురించి నేను మాట్లాడుతున్నాను"

"ఆపు నీ అసందర్భ ప్రేలాపన, ఎందుకు నా సహనాన్ని పరీక్ష చేస్తావు? నీలాంటి వీరుడు ఒక్కడు నా కరవాలాన్ని మోస్తే చాలు, ఈ ప్రపంచాన్నే జయిస్తాను. నీకేం కావాలోకోరుకో. ధనమా? ఈ భూమినంతా దగద్ధాయమానం చేయగల వజ్ర వైడూర్యాలు నీ ముందుంచుతాను. పదవా? నీ ఒక్క కనుసైగతో పౌరులందర్నీ పాదాక్రాంతం చేసుకోగలిగేంతటి అధికారాన్ని ఇస్తాను. ప్రజల ముందు నాకు క్షమాపణలు చెప్పి నా కిరీటంలో వెలలేని మణిగా నిలిచిపో" రాజు అర్థించాడు.

విజయసింహుడు రాజు కళ్ళలోకి సూటిగా చూశాడు. కొన్ని క్షణాల తరువాత "నేను క్షమాపణలు చెపుతాను" అన్నాడు.

ప్రజలంతా దిగ్భ్రాంతి చెందారు.

"ద్రోహి"

"దేవుడు కూడా అమ్ముడుపోతాడా"

విజయసింహుడు ప్రజలందరినీ తేరిపార చూశాడు. అతడి చూపు నుసగ్గా మారింది కన్నీళ్ళతో

"ప్రజలారా, నేను క్షమాపణలు కోరుతున్నాను. మిమ్మల్ని క్షమాపణ కోరుతున్నాను. పోరాటం మధ్యలోనే నిష్క్రమిస్తున్నందుకు నన్ను మన్నించండి. మృత్యువు నా తల మీద డేగలా ఎగురుతూ వుందని నాకు తెలుసు. మరణాన్ని నేను ప్రేమిస్తాను. కాని పోరాటానికి మరణం లేదని నాకు తెలుసు. తల్లులారా, మీ బిడ్డకు బొడ్డు కోసిన కత్తితోనే అతనికి పోరాట పాఠాలు నేర్పించండి. దుర్మార్గానికి, దౌర్జన్యానికి, రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడండి..."

ఈ మాటలు విన్న రాజు ఆగ్రహంతో వణికిపోయాడు.

"ఎవరైనా సరే, ఒక కత్తి వేటుతో అతని ప్రసంగాన్ని ముగించండి" అన్నాడు.

విజయసింహుడి తల తెగింది.

వంచడం నేర్వని తల అది.

* * *

"అయ్యా, ఇన్ని వందల ఏళ్లుగా మీ ఆత్మకు శాంతి కలుగలేదా?" విజయసింహుడిని ప్రశ్నించాను.

"ఈ భూమి కన్నీళ్ళతో తడవకుండా వున్న రోజు నా ఆత్మకి శాంతి కలుగుతుంది" అన్నాడు శూన్యంలోకి చూస్తూ.

"అయ్యా, అది సాధ్యమయ్యే పనేనా? ఆ పని ఎవరు చేయగలరు. మనిషి మాత్రమే చేయగలడు. కాని అతను పతనమై వున్నాడు. విశ్వాస రాహిత్యయుగంలో బతుకుతున్నాడు. అతనికి దేనిపైనా నమ్మకం లేదు- ముఖ్యంగా తన అంతరాత్మ మీద! పొరుగువాడి మరణం మీద తన బతుకు ఆధారపడి వుందని అతను భావిస్తున్నాడు. అతడు సాధించిన సమస్త శాస్త్ర విజ్ఞానాన్ని, పాలు లేక గుక్కపట్టి ఏడ్చే ఒక పసిపాప ఏడుపు సవాల్ చేస్తూ వుంది. మానవుడు ఒక భూతల కీటకం! వాడి గురించి ఆలోచించడమే వృధా!" కసిగా అన్నాను.

నా మాటలు వినగానే విజయసింహుడు వడివడిగా అడుగులేసుకుంటూ నా దగ్గరకొచ్చాడు అతని చూపులు ఎంత తీక్షణంగా వున్నాయంటే, నేను మనిషినై వుంటే ఆ తీక్షణతకు గుండాగి చచ్చేవాణ్ణి. దెయ్యాన్ని కాబట్టి బతికిపోయాను.

"ఏమన్నావ్, మాట వెనక్కి తీసుకో. మానవుడంటే ఎవరనుకున్నావ్? ఈ భూమికంతా అధిపతి వాడు. మనిషి లేని ప్రపంచాన్ని నువ్వు వూహించగలవా? వాడు నీచుడు, ద్వేషించడానికి అన్ని అర్హతలు వున్నవాడు. కాని వాడిని మనం ప్రేమించాలి. మనిషి ఏమైనా చేయగలడు. నాకు విశ్వాసముంది" అన్నాడు.


"ఇన్ని వందల ఏళ్ళ తరువాత కూడా మీ అనుభవాల నుంచి మీరేమీ నేర్చుకోలేదా? మనిషిపైనా ఇంకా నమ్మకముందా?"

ఆ మాటకు విజయసింహుడు కాసేపు మౌనంగా వుండిపోయాడు. తరువాత తనలో తాను గొణుక్కుంటున్నట్టు మాట్లాడసాగాడు.

"నెత్తుటితో తమ చరిత్రలు రాసుకున్న ఎందరో నరహంతకుల ఆత్మలు ఈ దారిలో నాకు తారసిల్లాయి. వారి ఆత్మలు అపరాధ భావంతో కుష్కించిపోయి కనిపించాయి. వాళ్ళందరినీ నేను ప్రశ్నించాను "మీ కత్తుల మీద నెత్తుటి తడిని ఆరనీయకుండా బతికారు కదా, మీరేం సాధించారు" అని.

అన్నింటికి ఒకే సమాధానం. మౌనం లేదా ఒక కన్నీటి బొట్టు. దుర్గమమైన అరణ్యాల్లో, మైదానాల్లో వారి ఆత్మలు ఘోషిస్తూ వుండేవి. ఆకాశం వైపు చేతులు సాచి, కనపడని శక్తిని ప్రార్థించేవి.

'ప్రభువా, మాకు మరొక్క అవకాశాన్ని ప్రసాదించు. మళ్ళీ మనుషులుగా పుట్టించు. సమస్త దోషాలను ప్రక్షాళన చేసుకుంటాం. మనుషులుగానే బతుకుతాం' అని దీనంగా వేడుకునేవి.




వారికి తెలుసు మనిషి జన్మ మరోసారి దుర్లభమని! నాకు తెలుసు. మనుషులు కపటంతోనూ, ద్వేషంతోనూ కప్పబడిపోయారని. కాని ఏదో ఒక తుపాను వాళ్ళని వెలికి లాగుతుంది.

మనిషి పతనమై వున్నాడని నాకు తెలుసు. అంతే కాదు అతను గాయపడి కూడా వున్నాడు. వాడి బట్టల్ని పీలికలు చేసి, వాడిని దిగంబరుడిని చేసైనా సరే, వాడి గాయాలకు కట్లు కట్టాలి"

* * *

నేను విజయసింహుడితో కలిసి కోటలోనే వుండిపోయాను.

కొద్దిరోజుల తరువాత అడవిలో మాకొక దృశ్యం కనిపించింది. ఒక స్త్రీ, ఒక పురుషుడు, మరో పసి బాలుడు అడవిలో పడి వుండగా మేము చూశాం. వాళ్ళ ఒంటి మీద గాయాలున్నాయి. కొన వూపిరితో వున్నారు. వారిని కోటకు తీసుకొచ్చాం. రెండు రోజులపాటు మూలికలతో చికిత్స చేశాం.

మొదట పసివాడు కళ్ళు తెరిచాడు. వాడికి ఐదారేళ్ళుంటాయి. కళ్ళు తెరవగానే విజయసింహుడి గడ్డం వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"ఇంత పెద గడ్డమా!" అని పట్టుకుని లాగాడు. విజయసింహుడు పకపక నవ్వాడు.

తరువాత స్త్రీ, పురుషులు కళ్లు తెరిచారు. వారి కళ్ళలో అవిశ్వాసం, అభద్రత!

మమ్మల్ని చూడగానే చేతులు జోడించి "మమ్మల్ని చంపకండి" అని వేడుకున్నారు.

"భయపడకండి. మేము మీకు హాని చేయము. మీరెవరు? మిమ్మల్ని ఎవరు గాయపరిచారు?" అని విజయసింహుడు ప్రశ్నించాడు.

"మేము కూలివాళ్ళం. ఎక్కడ పని దొరికితే అదే మా వూరు. మాకు ఇద్దరు పిల్లలు. నెల రోజుల క్రితం ఒక వూరికి వచ్చాం. మాలాగే వందలాది మంది అక్కడున్నారు. రెక్కలుముక్కలు చేసుకుని ఎలాగో బతుకుతూ వుంటే ఒకరోజు రాత్రి కిరాతకపు దండొకటి మా గుడిసెల మీద పడింది. చేతికందిన వారిని నరికేశారు. పారిపోలేని వాళ్ళంతా చచ్చిపోయారు..." చెప్పడం ఆపి అతను కళ్ళు మూసుకున్నాడు. ఆ కాళరాత్రిని కళ్ళ ముందు చెరిపేసుకోడానికన్నట్టుగా కళ్ళను గట్టిగా నులుముకున్నాడు

"మరి ఇంకో బిడ్డ?"

ఆ మాటతో తల్లి దుఃఖం కట్టలు తెంచుకుంది. గుండె పగిలిపోయేలా ఏడవసాగింది.

"ఊయలలోని బిడ్డను ఆ దుర్మార్గులు పైకెగరేశారు. నా కళ్ళ ముందే జరిగింది. పై నుంచి కిందపడుతున్న బిడ్డను చేతులతో కాకుండా...కత్తులతో..."

తల్లి కన్నీళ్లని తుడిచేపాటి పాడుగాటి చేతులు ఈ ప్రపంచంలో ఎవరికున్నాయి?

వారి దుఃఖాన్ని చూడలేక మేము దూరంగా వచ్చాం. "వాళ్ళు ఇక్కడే వుంటారు. దిక్కులేని వారిని ఆదరించే శక్తిని మనుషులు కోల్పోయినపుడు, ఆ పనిని దయ్యాలైనా నిర్వర్తించాలి" అన్నాడు విజయసింహుడు.

* * *

ఆ దంపతుల గురించి చెప్పడానికి ఏమీ లేదు. వారు జీవితం పట్ల భయపడిపోయారు. ఒక అపస్మారక స్థితిలో వారు కాలాన్ని వెళ్ళబుచ్చుతున్నారు.

ఇక మిగిలింది ఆ పసివాడు. వాడి పేరు సూర్యా చాలా తొందరగా వాడికి మేము స్నేహితులయ్యాం. విజయసింహుడు ఒక్కోసారి గుర్రంగాను, మరోసారి డేగలాగా వాడిని భూమ్యాకాశాల్లో తిప్పేవాడు. సూర్యా ముందు విజయసింహుడు మరీ పసివాడైపోయాడు.

సంపూర్ణ మానవుడెప్పుడూ సగం పసివాడుగా వుంటాడు!

సూర్యా ఎంత తుంటరివాడంటే అడవంతా కలియతిరిగేవాడు. ఒకసారి సింహం వెనుకపాటుగా వెళ్ళి దాని తోకను మెలితిప్పాడు. అది గాండ్రుమంటూ మీదికి దూకింది. సమయానికి నేనూ, విజయసింహుడు వాడి చెరో రెక్క పట్టుకుని ఆకాశంలోకి లేపుకెళ్లాం.

ఒక వెన్నెల రాత్రి ఆకాశంలో విహరిస్తుంటే చంద్రున్ని అందుకుంటానని గొడవ చేశాడు. ఆకాశంలో వెళుతున్నప్పుడు మేఘాలతో బలే ఇబ్బంది. అవి పొట్టనిండా నీళ్ళు తాగి నెడుతూ వుంటాయి. వాటి మధ్యన మనం దూరితే మొత్తంగా తడిపేస్తాయి. మేఘాలతో స్నానం చేయడమంటే సూర్యాకు బలే ఇష్టం.

ఇక వర్షపు రాత్రుల్లో వాడి ఆనందాన్ని వర్ణించడానికి వీలు కాదు. మెరుపులు మెరిసినపుడు మా కోట ఒక్క వెలుగు వెలిగేది.

వర్షపునీటిని దోసిళ్ళతో పట్టుకుని మా మీదికి వెదజల్లేవాడు సూర్యా.

"తాతయ్యా, ఆకాశానికి జలుబు చేసింది దగ్గుతూ వుంది కూడా. ఏదైనా మందివ్వు" అని అడిగేవాడు.

ఒకరోజు....

తెల్లవారుజాము.

పక్షులన్నీ పొట్ట చేత పట్టుకుని ఏదో ఒక దిక్కుకు వెడుతున్నాయి. సూర్యా ఒక గొడ్డలిని భుజాన వేసుకుని కోట నుంచి బయటికి వచ్చాడు. పరుశురాముడిలా వున్నాడు వాడు.

కోట బయట వున్న బ్రహ్మాండమైన వృక్షం ముందు ఆగాడు.

"తాతయ్యలూ, ఈ చెట్టు వేళ్ళన్నీ కుళ్లిపోయాయి. దీన్ని నరికెయ్యాలి" అన్నాడు.

"సూర్యా, మహా బలశాలులకే ఆ వృక్షాన్ని నరకడం సాధ్యం కాదు. నువ్వెంత పసిబాలుడివి" అని నేను వారించాను.

విజయసింహుడు కళ్ళతోనే నన్ను కోప్పడ్డాడు.

"సూర్యా నీ పని కానివ్వు" అన్నాడు.

సూర్యా గొడ్డలిని పైకెత్తాడు.

ఫట్మని దెబ్బపడింది.

ప్రశాంతమైన తేజస్సుతో ఉదయభానుడు తలపైకెత్తుతున్నాడు.

నేనూ, విజయసింహుడు ఒక కొండ శిఖరం మీద కూర్చొని అడివినంతా బంగారంతో వెలిగిస్తున్న సూర్యోదయాన్ని చూడసాగాం.

సూర్యా గొడ్డలి చప్పుడు లీలగా వినిపిస్తూ వుంది.

విజయసింహుడి మొహం వింత తేజస్సుతో ప్రజ్వరిల్లుతూ వుంది.

"సూర్యా అంటే ఎవరనుకున్నావ్" వాడు రేపటి తరం ప్రతినిధి. వాళ్ళు ఏమైనా చేయగలరు. కుళ్ళిపోయిన వృక్షాలను పెకలించి వేస్తారు. తుప్పు పట్టిన అన్ని విలువలను సముద్రంలో పాతేస్తారు. ఇవన్నీ వాళ్ళు చేస్తారు. నాకు నమ్మకముంది. ముసలివారు యువకులకు చేయగలిగిన సాయమేదైనా వుంటే అది వినమ్రంగా పక్కకు తప్పకొని దారివ్వడమే.

ఈ భూగోళం తలరాతను మార్చే శక్తి యువకులకు మాత్రమే వుంది. నాకు తెలుసు. పసిపాపల పెదవుల మీది చిరునవ్వులను చూడడానికే సూర్యచంద్రులు ఉదయించే రోజు ఒకటి వస్తుంది. ఆ రోజుకు స్వాగతం చెప్పడం కోసం మనమంతా ఎదురుచూడాలి.

ఆశ వెయ్యి ఏనుగుల బలాన్ని ఇస్తుంది.

నిరాశ మృత్యువుతో సమానం...

విజయసింహుడి కనుకొలకుల్లోంచి ఒక కన్నీటి బొట్టు రాలింది.

అతని గొంతులో జలపాత సంగీతముంది. ఆ సంగీతంలో నాకు మరో ప్రపంచపు హోరు వినిపిస్తూ వుంది.